క్షయవ్యాధి నివారణే మన నినాదం

- జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవం
- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ



పట్టణంలో క్షయ అవగాహన ర్యాలీ

పార్వతీపురంటౌన్: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జీఓ హోంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు వస్తే సాధారణ దగ్గుగానే భావిస్తామని, దానిని నిర్లక్ష్యం చేయరాదని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో సర్వేచేసి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వైద్యసిబ్బంది గుర్తించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కఫం పరీక్షలు చేస్తున్నామని, ఎక్స్‌రే యంత్రాలు, ఆధునికమైన సీబీనాట్, 19 ఆర్‌టీపీసీఆర్ టీబీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతినెలా రూ. వెయ్యి చొప్పున బాధితుల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. మందులు తప్పకుండా వేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ అవసరమన్నారు. టీబీముక్త్ భారత్ అభియాన్ కింద వ్యాధిగ్రస్తులకు నిక్షయ మిత్ర దాతల ద్వారా పోషకాహారం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ వైద్యసేవలు అందించిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ పీఎల్ రవికుమార్, ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాళ్ల వివేక్ తదితరులు పాల్గొన్నారు.



విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



సీతానగరం: ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

సీతానగరం: క్షయవ్యాధిని నివారించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో సోమవారం ఆయన పాల్గొన్నారు.ఈ మేరకు పీహెచ్‌సీ డాక్టర్లు పి ఉష, పి.పావని ల ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు వైద్యసిబ్బందితో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ టి.జగన్‌మోహనరావు మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకు వైద్యాధికార సిబ్బంది అవగాహన కల్పించుకుని ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డా.హేమాక్షి, హెల్త్ సూపర్‌వైజర్స్ సత్యవతి, భవాని, శర్మ, వైద్యసిబ్బంది, పోలీస్‌సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గొర్లి మాధవరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు ను, కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం పరామర్శించారు. బీసీ సెల్ అధ్యక్షుడి తల్లి పార్వతి ఇటీవల దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శేఖర్, గొర్లి శంకర్రావు, పట్నాన కిరణ్, జల్లు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో ఆస్పత్రి పనులు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: పట్టణంలోని వందపడకల ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యతాలోపానికి సంబంధించి 'ప్రారంభానికి ముందే పగుళ్లు' శీర్షికన ఈ నెల 16న సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు.ఈ మేరకు ఏపీఎంఎస్ఐడీసీ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.శ్రీనివాస మూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వందపడకల ఆస్పత్రి నిర్మాణ దశలో ఉందని, గోడలకు ప్లాస్టరింగ్, క్యూరింగ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బ్లాక్‌ల మధ్య శ్లాబ్ కారిడార్ ఎక్స్‌టెన్షన్ జాయింట్స్ ట్రీట్మెంట్ పనిచేయవలసి ఉందన్నారు. ఈ పనులు పూర్తిచేస్తే ఎటువంటి లీకులు ఉండవని తెలిపారు. ఆస్పత్రి పనులు పూర్తి నాణ్యతతో పూర్తిచేస్తామన్నారు. శ్లాబ్ మరమ్మతులకు ప్రత్యేకమైన ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టిండర్లు ఆహ్వానించామని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అమ్మాదేవి కొండపై ఏనుగుల జోన్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డివేణు

సీతానగరం: మండలంలోని జోగింపేట ప్రాంతంలో గల అమ్మాదేవి కొండపై ఏనుగుల జోన్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పలుగ్రామాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు మాట్లాడుతూ సీతానగరం, పార్వతీపురం మండలాల పరిధిలో ఉన్న అమ్మాదేవి కొండను ఆనుకుని ఉన్న 10 గ్రామాల ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా 1100 ఎకరాల్లో ఏనుగుల జోన్ పేరుతో ఫారెస్ట్ అధికారులు గ్రామాల చుట్టూ కందకాలు తవ్వడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులు ఎక్కడినుంచి వచ్చాయో అక్కడికే తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి రమణమూర్తి, జి.వెంకటరమణ, బి.శంకరరావు, ఎస్ వాసు, ఎస్ మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐసీడీఎస్ పరిధిలోని పార్వతీపురం మున్సిపాల్టీలో రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలోని రెల్లివీధి 25వ వార్డులో ఎస్సీ కేటగిరికి ఒకటి, 4వ వార్డులో బీసీ-డీ కేటగిరికి ఒకటి కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన వివాహిత మహిళలు దరఖాస్తులను మార్చి 31 సాయంత్రం 5 గంటల లోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పార్వతీపురం కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూకు పిలవనున్నట్లు స్పష్టం చేశారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం త్వరలో తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ సహాయకులకు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు పార్వతీపురం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి వేతన బిల్లులు చెల్లించాలి

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు 9 నెలలుగా బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకుడు ఆర్.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు వేతనదారులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీఓ భానుకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారుల జీవనోపాధి కోసం తెచ్చిన చట్టం ప్రకారం పని చేసిన రెండో వారంలో బిల్లులు చెల్లించాలని మార్గదర్శకాలున్నా ప్రభుత్వ పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట కాసేపు నిరసన తెలియజేశారు.

కార్యక్రమంలో మేట్‌లు, ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు, వ్యవసాయ కార్మికులు సీహెచ కృష్ణ, దినేష్, జి.భాస్కరరావు, అజయ్, పార్వతి రమణమ్మ, మేరీ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్యజాస్పిన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని పూతికవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పోక్సో చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. చట్టం గూర్చి కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యజాస్పిన్ తెలిపారు. 18 ఏళ్ల వయసులోపు బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకే ఈ చట్టం చేయడం జరిగిందని, ప్రధానంగా 12 ఏళ్ల వయసు కన్నా తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్‌ప్రసాద్, జి.రాజ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు పి.శ్రీనివాసులు, శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కె.కృష్ణమూర్తి (ఫైల్)

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి సామాజిక సేవలను గుర్తించి హైదరాబాద్‌లో ఉన్న సామాజిక సంస్కృత సేవా సంస్థ సేవా స్వర్ణ నంది ఉగాది జాతీయ పురస్కారం ఆయనకు అందజేసింది. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డా.జి.చంద్రయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

తన తండ్రి ఆశయం మేరకు మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు చేయూత అందిస్తానని కృష్ణమూర్తి అన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు చర్యలు

- రూరల్ ఎస్సై బి.సంతోషి



జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో తామర చెరువు వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను, డొంకలను సోమవారం జేసీబీతో తొలగించి మట్టిని సరిచేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మలుపుల వద్ద వాహన చోదకులు సురక్షితంగా ప్రయాణించేందుకు రోడ్డుకు ఇరువైపులా డొంకలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నట్లు చెప్పారు.

వైద్య మిత్రల శాంతియుత నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యమిత్రలు

పార్వతీపురంటౌన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యమిత్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వైద్యమిత్రలు శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యమిత్ర నిమ్మకాయల రాజ్ కమల్ మాట్లాడుతూ గత 17 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జీవో నంబర్ 28 రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తమను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పార్వతీపురం: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల రక్షణకోసం సంబంధిత యజమానులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ డీవీ.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల కారణంగా వివిధ సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు, భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన తాగునీరు, పనిచేసే చోట నీడ ఉండేలా వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని యజమానులకు సూచించారు.

ప్రమాదాలు జరిగితేనే నిర్లక్ష్యం వీడుతారా?



పులిగుమ్మి రహదారిపై ఏర్పడిన గుంతలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పులిగుమ్మి రహదారిపై ప్రయాణం అడుగడుగునా గుంతలతో నరకాన్ని తలపిస్తోంది. శిథిలావస్థకు చేరిన రహదారిపై రాళ్లు తేలి గుంతలు ఏర్పడడంతో తరచు వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తట్ట మట్టి పోసిన పాపాన కూడా పోలేదు. భారీస్థాయిలో ప్రమాదాలు జరిగితేనే అధికారులు నిర్లక్ష్యం వీడుతారా? అంటూ సంబంధిత అధికారుల తీరుపట్ల వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్యాచ్‌వర్కులు చేపట్టి అయినా రహదారిని సురక్షితంగా ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

సారా కేసుల్లో ఆరుగురిపై బైండోవర్



సారాతో పట్టుబడిన నిందితులు

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి మండలంలో సారా కేసుల్లో పట్టుబడిన ఆరుగురు నిందితులపై గరుగుబిల్లి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ కేసులు పెట్టినట్లు సీఐ డి.పద్మావతి ఒక ప్రకటనలో సోమవారం తెలియజేశారు. బైండోవర్ కేసులో ఉన్న నిందితులు ఒక సంవత్సరం కాలంలో మళ్లీ సారా కేసుల్లో పట్టుబడితే లక్ష రూపాయల జరిమానాతో పాటు ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. నిందితులు సారా తయారుచేసినా విక్రయించినా శిక్షార్హులేనని స్పష్టం చేశారు.

జిల్లాలోని పార్కులను అభివృద్ధి చేయండి



డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పార్కులను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్ఓ హేమలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ తదితర పట్టణాల్లో పార్కులు అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో గల పార్కుల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్వతీపురంలో గల పార్కులు దాదాపు కబ్జాకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా స్థలాలను రక్షించి పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. కొత్తవలస, రాయగడ రోడ్డు, జగన్నాథపురం, వైకేఎం కాలనీల్లో ప్రజలకు పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే పాలకొండ, సాలూరు, మున్సిపాల్టీల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కులు అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.సాయి శ్రీనివాసరావు, టి.గౌరీశంకరరావు, ఎం. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలి



కలెక్టరేట్‌వద్ద నిరసన తెలుపుతున్న తెలుగు అధ్యాపకులు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థలో తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలుగు అధ్యాపకుడు డి.పోలినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల తెలుగు అధ్యాపకులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి నేటివరకు తెలుగు భాషను ద్వితీయ భాషగా గుర్తించి తెలుగు సబ్జెక్టుకు పెద్ద పీట వేశారన్నారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి విద్యాసంస్కరణలలో భాగంగా తెలుగు సబ్జెక్టుకు ప్రాధాన్యం తగ్గించి ఆప్షన్ సబ్జెక్టుగా కేటాయించడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల భవిష్యత్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, సమాజానికి అనేక సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. మాతృభాషపై మమకారం పోయి భాషపై విద్యార్థుల్లో పట్టు తగ్గుతుందన్నారు. భాషా నైపుణ్యం తగ్గుతూ మాతృభాషపై చులకన భావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ మండల స్థాయి పబ్లిక్ హియరింగ్

- ఉపాధి పనులపై ప్రజావేదిక



ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ కె.రామచంద్రరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనుల నిర్వహణలో భాగంగా 17 వ విడత ఉపాధి హామీ పథకం ద్వారా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ ఉపాధి నిధులు రూ.28కోట్ల 49 లక్షల19వేల 812లు ఖర్చుచేశారు. ఈ పథకం నిధులతో చేసిన ఖర్చులపై స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రజావేదిక జరిగింది. ఈ మేరకు మండలంలోని 35 గ్రామపంచాయతీల సామాజిక తనిఖీలను పూర్తి ఆధారాలతో నివేదికలను ఎస్సార్పీ మాధవరావు ఆధ్వర్యంలో డీఆర్పీలు పి.అప్పలనాయుడు, రాము, సతీష్, అశోక్‌కుమార్ నివేదించారు. గ్రామాల్లో క్షేత్రసహాయకులు క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు అమర్చక పోవడం వల్ల వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు.లేనిపక్షంలో బోర్డులకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీఓ పి.త్రివిక్రంరావు, ఏపీఓ భాను, ఈసీ కృష్ణ, టెక్నికల్ సహాయకులు, సర్పంచ్‌లు పి.సత్యంనాయుడు, జె.తేరేజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వెహికల్ ఫిట్మెంట్ సెంటర్‌ను వినియోగించుకోవాలి



ఫిట్మెంట్ సెంటర్‌వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విజయచంద్ర

సీతానగరం: మండలంలోని చినభోగిలి వద్ద ఏర్పాటు చేసిన వెహికల్ ఫిట్మెంట్ సెంటర్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చినభోగిలి వద్ద ఏర్పాటు చేసిన ర్యాపిడ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సెంటర్‌ను ఆయన సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రకాల వాహనాల యజమానులు వారి వాహనాలను ఇక్కడికి తెచ్చి ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి ధ్రువీకరణ పత్రాలు పొందే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఫిట్మెంట్ కోసం ఆర్టీ కార్యాలయానికి వెళ్లవలసిన అవసరంలేదని తెలియజేశారు. కార్యక్రమంలో ఫిట్మెంట్ సెంటర్ ఎం.డి సంతోష్, పలుగ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

- రెవెన్యూ అధికారులు చొరవ చూపించాలని డిమాండ్

మక్కువ: మండలంలోని పలుగ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు గంగునాయుడు, ఎస్ వై నాయుడు మాట్లాడుతూ శంబర, తూరుమామిడి గ్రామాల్లో సుమారు 45 ఎకరాల భూమిని పెత్తందారులు ఆక్రమించారని, ఆక్రమించుకున్న భూములపై విచారణ చేపట్టి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అలాగే వెంకటభైరిపురం, లోతుగడ్డ, మోసూరువలస, మూకవలస, సీబిల్లి పెద్దవలస గ్రామాల్లో ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న పేదలు, గిరిజనులకు డి పట్టాలివ్వాలని కోరారు. లోవరకండి, దుగ్గేరు, ఆళ గురువు గ్రామాల్లో సాగు చేస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అనేక గ్రామాల్లో తరతరాలుగా పేదలు, గిరిజనులు సాగు చేస్తున్న బంజరు భూములకు డి పట్టాలు ఇవ్వకుండా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. అనేక గ్రామాల్లో పేదలభూములు అన్యాక్రాంతం అయినప్పటికీ, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు పెత్తందారులకు కొమ్ము కాస్తున్నారని, అన్యాక్రాంతమైన పేదల భూములకు తిరిగి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై గతంలో అనేక సార్లు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినితిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మక్కువ మండల నాయకులు ప్రభాకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి సీతారాం, దాడి శ్రీను, చినబాబు, గోపి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై డీఆర్‌వోకు ఫిర్యాదు



డీఆర్‌వో హేమలతకు ఫిర్యాదు చేస్తున్న తోటపల్లి గ్రామ మహిళలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై, డీఆర్‌వో కె.హేమలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఆలయ ఆవరణలో కొంతమంది అక్రమార్కులు అక్రమంగా నిర్మాణాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ నిర్మాణాల వల్ల భక్తులకు అసౌకర్యం తలెత్తుతోందన్నారు. ఆక్రమణలపై సర్వే చేసి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దారును డీఆర్‌వో ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సరళ, ఉమామహేశ్వరి, సునీత, పార్వతి, పద్మ ఉన్నారు.